# వైకుంఠ ఏకాదశి

డిసెంబరు ఇరవైమూడో తారీఖున మా తిరుపతి ప్రయాణం నిశ్చయమైంది. ఆవేళ నుంచి మనుమలకు సెలవులిస్తారు. పదిహేను రోజులముందే రిజర్వేషనుకు ప్రయత్నించాను. కాని వెయిటింగ్ లిస్ట్‌లో అరవైరెండో నంబరు నుంచి మా పేర్లున్నాయి. ఒక వారం రోజుల తర్వాత పరిస్థితి తెలుసుకోడానికి స్టేషన్‌కి వెళ్లాను. ఏమీ మెరుగుపడలేదు. ప్రయాణం వాయిదావేసి, జనవరి మొదటివారంలో వెళ్లవచ్చని టికెట్లు రద్దుచేయించాను.

అనుకోకుండా రైల్వేలో పనిచేస్తున్న మా స్నేహితుడొకడు స్టేషనులో కలిశాడు. అన్నవరం కోటా నుండి పది టిక్కెట్లకు అతను ఏర్పాటు చేశాడు. కొంచెం డబ్బు ఖర్చయింది. ప్రయాణం మాత్రం చాలా సుఖంగా, మరే ఇబ్బందులూ లేకుండా డిసెంబరు ఇరవైమూడుకే జరిగింది.

మరునాడు ఉదయం పది గంటలకు తిరుపతి స్టేషనులో దిగాము. ట్రెయిన్ లేటు. ఆ రోజు వైకుంఠ ఏకాదశి అని తోవలో తెలిసింది.

వైకుంఠ ఏకాదశికి ప్రజలు కుప్పలు తెప్పలు వచ్చిపడతారని అనుకున్నాం కాని, కింద తిరుపతిలో అంత రద్దీ కనిపించలేదు. ఏకాదశినాడే స్వామివారి దర్శనం చేయాలని మాకేమీ పట్టింపు లేదు. దిగువ తిరుపతిలో ఆ రోజు ఉండి, మరుసటి ఉదయం కొండమీదకు వెళ్తే కాటేజీలు దొరుకుతాయని దేవుడి దర్శనం కూడా సులువుగా అవుతుందని అనుకున్నాం.

ప్లాటుఫారానికి అటుపక్కనున్న సత్రవుగదికి సామాను చేర్చడానికి ఒక కూలీ కుదిరాడు. రెండుసార్లు సామాను మోసి సత్రవుకు చేర్చాడు. గదులు చాలా ఖాళీగా వున్నాయి. గుమాస్తాతో చెప్పి ఆ కూలీయే మంచి గది ఇప్పించాడు.

డబ్బులు తీసుకుని వెళ్లబోతూ వాడు నన్నడిగాడు.

"బాబుగారూ! ఇవాళ వైకుంఠ ఏకాదశి. స్వర్గ ద్వారాలన్నీ తెరచి వుంటాయి. ఇంత దూరం వచ్చి, ఈరాత్రి దిగువ తిరుపతిలో గడుపుతారా?"

అంటూ, వాడు మరేవో చెప్పి, తొందర పని వుందని డబ్బులు తీసుకొన్న వెళ్లిపోయాడు.

మా స్నానాలు, భోజనాలు, అయేసరికి ఒంటిగంట దాటింది. కొంచెంసేపు విశ్రాంతి. తీసుకుని, ఊరిలో తిరిగి వద్దామన్న ప్రోగ్రాము రద్దు చేసుకుని, మూడు గంటల బస్సుకి కొండమీదకు బయలుదేరాము. వైకుంఠ ఏకాదశి. రాత్రికి భగవంతుడి సన్నిధిలో ఉండటమే పదివేలు!

మరునాడు క్రిస్టమస్. కొండ ఎక్కుతున్న కొద్దీ గాలిలో చల్లదనం హెచ్చింది. నాలుగున్నరకి కొండమీద దిగేసరికి చలిగాలి జోరుగానే వీస్తున్నది. బస్సులో నుంచి దిగి నేలను కాలుమోపడానికి వీలు లేకుండా జనం! సామాను దించుకోవడం ప్రళయమైంది. పెట్టెలు, పరుపుచుట్టలు, సంచులు అలా అలా ఇరవై సామాన్లు, చూస్తుండగానే ఎండ వెనక్కు పోయింది. బస్సు వెనుక బస్సు మనుషులు, సామానులు! ఎవడో కూలీవాడు అన్నాడని కొండమీదకు పిల్లలతో రావడం పొరపాటయిందనిపించింది.

ఏం చేయడం?

జన సాగరాన్ని చూస్తూంటే మతులు పోతున్నాయి!

చీకటి పడకుండా అక్కడ నుంచి కదిలి మరో చోటు చూసుకోకపోతే ప్రజలు మామీద దిగుతారు.

కొంచెం చోటు దొరుకుతే, ఎదురుగా ఉన్న కాటేజీలిచ్చే ఆఫీసు హాలులోకి సామానుతో మారిపోయాం. పైన కప్పు అయితే ఉంది కానీ సూదుల్లా పొడిచే చలిగాలికి అక్కడ అడ్డులేకుండా పోయింది.

ఒక అల్లుడు కాటేజీలిచ్చే వరుసలో చివర కూర్చున్నాడు. మరో అల్లుడు, పిల్లలు చలిగాలికి చాటుండే చోటు కోసం తిరిగారు. చివరకు రైలు టిక్కెట్లు అమ్మే చోట కూర్చోటానికి రెండు కుర్చీలు, సామాను పెట్టుకోవడం కోసం కొంచెం జాగా దొరికాయి. ప్రాణం లేచివచ్చింది. ఫైవ్‌స్టార్ హోటల్‌లో గది దొరికినట్లయింది.

ప్రతి అయిదు నిమిషాలకు ఒక్కొక్క బస్సు వచ్చి యాత్రికులను కొండమీదే దింపేసి వెళ్లిపోతుంది. ఆ జన సముద్రం సంక్షుభితమైనట్లు తోచింది.

వేడి వేడి పాలు తెచ్చి మనుమలిచ్చారు. కుర్చీ మీద కూర్చున్నాను. లోపల వెచ్చగా ఉంది. కాని ఆ సుఖం అట్టేకాలం సాగదని తెలిసింది. ఎనిమిదన్నరతో టిక్కెట్లు అమ్మే వ్యాపారం ముగుస్తుంది.

తరువాత ఏం చేయడం?

కాటేజీలు ఇచ్చే చోట పెద్ద కలకలం! ఒక కాటేజీ కూడా ఖాళీ లేదు. ఏదో సత్రవులో తలదాచుకోమని సలహాలిచ్చి కౌంటర్లు మూసేస్తున్నారు. ఏ సత్రవు చూసినా సూది మోపడానికి కూడా చోటు లేకుండా జనులు! మనుషులకే చోటు లేదు, మరి సామాను ఎక్కడ పెట్టుకోవడం?

ఘండికోట బ్రహ్మాజీరావు

చలిగాలి నిర్దాక్షిణ్యంగా వీస్తున్నది.

కాటేజీ వరుసలలో నిలబడ్డ మా అల్లుడు ముఖం వేలాడేసుకుని రావడానికి బదులు నవ్వుకుంటూ వచ్చాడు.

"కోటలో పాగా వేశాం, మామగారూ!"

అందరం అతని చుట్టూ మూగాము.

వరుసలో ఒకాయన మా అల్లుడికో మినిస్టరుగారి ఉత్తరం ఇచ్చాడు.

అతను అటువంటి ఉత్తరాలు రెండు తెచ్చాడు. మొదటిదానితో పని జరిగింది. రెండవదానిని మా అల్లుడికిచ్చాడు. రాజశేఖరం అన్న తన స్నేహితుడికి బస ఇవ్వమని మినిస్టరుగారు రాశారు. కాటేజీలు ఇచ్చేవాళ్లు మినిస్టరు గారి ఉత్తరాన్ని గౌరవించారు. వెంటనే కాటేజీ ఇవ్వలేనందుకు క్షమాపణలు చెప్పుకుంటూ, ఆ రాత్రికి కొద్దిదూరంలో వున్న సత్రవులో ఒక గది ఇచ్చారు.

చాలా అదృష్టవంతులం! బసకు మరి ఇబ్బందిలేదు.

కాని, ఇరవై సామాన్లతో ఆ సత్రవు చేరడమెలా?

చలికాలానికి తెచ్చిన రగ్గులు, దుప్పట్లు, శాలువలు అన్నీ బరువెక్కి కూర్చున్నాయి.

ఆ సమస్యను కూడా మా అమ్మాయి పరిష్కరించింది.

సామానులు తీసుకుపోయి సత్రవుకు చేర్చడానికి ఇరవై రూపాయలకో జీపును ఆమె కుదిర్చింది. మనుషులు, సామానులు హాయిగా జీపుమీద వెళ్లవచ్చు ననుకున్నాం కాని, మా సామానులు అందలమెక్కి కూర్చుని మాకు వాహనయోగం కలిగించలేదు.

జీపువరకు, ఒక ఫర్లాంగు దూరం సామాను మోసుకుపోవడం చాలా శ్రమదాయకమైంది. సత్రవు గది దొరికిందన్న సంతోషంతో అన్ని బాధలు మరచి జీపు వెనుక నడిచాం.,

ఒక ఇరుకు దారిన సత్రవు వైపు పోతున్న జీపు మధ్యలో ఒక్కసారి ఆగిపోయింది.

ఏమైంది? ఏమైంది?? ఏమైంది???

వెనుక నడుస్తున్న వాళ్లమందరం ముందుకు దూకాం.

అందరం ఒక్కసారిగా ఆగిపోయాం.

దారికడ్డంగా ఒకడు వెల్లకిలా పడివున్నాడు. అతనెవరో తాగుబోతనుకున్నాం కాని, అతనిలో చలనం లేదు.

సత్రానికి పోతున్న మనుషులందరూ ఆ చైతన్యం లేని శరీరాన్ని తప్పించుకుని నడుస్తున్నారు. అతనిని చూడకుండా ముఖం తిప్పుకుని వెళ్లిపోతున్నారు.

జీపు వెనక్కి తిప్పి మరో దారంట తీసుకుపొమ్మన్నాం కాని మిగిలిన దారులన్నీ మూసివేశారు.

ఎక్కడికెళ్లినా శని మమ్మల్ని విడిచిపెట్టడంలేదు.

పిల్లలూ, పెద్దలూ తలో సామాను ఎత్తుకొని, ఇబ్బంది పడుతూ శవం పక్కనుంచి నడిచారు.

ఆ శరీరాన్ని ఒక పక్కకు చేర్చడం గాని, కనీసం దానిపైన ఒక గుడ్డ కప్పడం గాని ఎవరూ చేయలేదు.

సత్రం గది దొరికిందన్న సంతోషం గదిలోకి ప్రవేశించడంతోనే మాయమైంది. ద్వారం దగ్గర పైనుంచి నీళ్లు బొట్లుగా పడుతున్నాయి. గదిలోకి దూరడం మంచుముక్కలోకి దూరినట్లే అయింది. పైన చలిగాలి రొద పెడుతున్నది. గదిలో ఒక బల్బు తప్ప మరే మంచాలు కాని, పరుపులు కాని లేవు. పెట్టెలు సర్దుకుని, పక్కలు పరుచుకున్నాం. పై నుంచి చలి. అడుగు నుంచి చలి! తెచ్చిన రెండు రగ్గులు, నాలుగు శాలువలు పనికిరాకుండా పోయాయి. ఏ స్వెటర్లూ నిలవలేదు.

ఏం చేయడం?

పైకి వచ్చి వరండాలో ఒక క్షణం నిలబడ్డాను.

కాఫీ లమ్మే అతను పక్క గది బయట ఉన్నాడు.

అతనితో మా ఇబ్బందులు చెప్పుకున్నాను.

అతనో సలహా ఇచ్చాడు.

"ఈ సంవత్సరం కొండమీద చాలా చలిగా ఉంది. కింద చాప, దానిపైన రగ్గు, పైన దుప్పటి పరుచుకుని, కంబళి కప్పుకుంటే కాని చలి ఆగదు. లేకపోతే రాత్రంతా ముణుకులు గుండెల కదుకుముని కూర్చోవాలి. ఒక ఫర్లాంగు దూరం మీరు వచ్చినదారి నడిస్తే, ఎడమ పక్కన కొన్ని ఇళ్లున్నాయి. అందులో మొదటి ఇల్లే మునిస్వామిది. అతని దగ్గర చాపలు, రగ్గులు అద్దెకు దొరుకుతాయి"

ఎగిరి గంతేశాను. మా అల్లుడిని తీసుకుని మునిస్వామి దగ్గరికి బయలుదేరాను.

రాత్రి పదకొండు దాటిపోయింది.

ఆకాశం మీద నక్షత్రాలు స్వచ్ఛంగా వెలుగుతున్నాయి.

చంద్రుడు తిరుగుముఖం పట్టాడు.

దారికడ్డంగా ఆ మనిషి అలాగే పడి వున్నాడు.

రోడ్డు దీపం వెలుగులో ఒకసారి ఆ శరీరాన్ని చూశాను.

ఆ మనిషి ముఖంమీద కుడివైపు చిన్న కాయ స్పష్టంగా కనిపించింది.

నన్నెవరో ముఖంమీద బలంగా కొట్టినట్లైంది.



మెడలో ముడివేసిన రుమాలు, ముఖం మీద కాయు అతను మరెవడో కాదు, కింద తిరుపతిలో ఘాసామాను సత్రవుకు మోసిన వడుచువాడు.

వైకుంఠ ఏకాదశిని జ్ఞాపకం చేసిన పుణ్యాత్ముడు.

తాపీగా ఆ మనిషిని దాటి మునిస్వామి ఇల్లు చేరుకున్నాము. రగ్గులు, చాపలు ఒకేసారి తీసుకుపోవడానికి వీలవలేదు. మా అల్లుడు కొన్నింటిని పట్టుకొని సత్రవుకు వెళ్లాడు.

నా ఎదురుగుండా మునిస్వామి కూర్చున్నాడు. అతనికో పొడుగాటి గడ్డముంది. ఇంట్లో ఆడవాళ్లు, పిల్లలు ఉన్నారు. అతనితో అన్నాను.

"మునిస్వామిగారూ! అక్కడ పడి వున్న మనిషి తాగి పడ్డాడా?"

"వాడు తాగవలసినవాడు కాదు. నాకు బాగా తెలుసు"

"అతని వాళ్లెవరూ లేరా?"

"లేరు"

"మీకతను తెలుసా?"

"తెలియకేం! వాడిని అందరం కోటిగాడంటాం. కొండమీద, దిగువన కూలీగా పనిచేస్తాడు. వాడు చేయని పనంటూ లేదు. కాటేజీలిప్పిస్తాడు. దర్శనాలు చేయిస్తాడు. యాత్రికులు ఏది కావాలంటే అది ఏర్పాటు చేస్తాడు. చాలా చురుకైనవాడు. చాలా బలమైనవాడు"

"మరెందుకలా పడిపోయాడు?"

"సాయంకాలం నాలుగు వరకూ వాడు నిక్షేపంలా ఉన్నాడు. నా దగ్గరకు వచ్చాడు. చాలాసేపు మాట్లాడాడు. మధ్యాహ్నం వాడు దేవుడిని చూసి వచ్చాడు. దర్శనమైన దగ్గర నుంచి వాడు మారిపోయాడు"

"అదెలా?"

"ఇవాళ వాడు అసలు దేవుడిని చూడాలని అనుకోలేదు. కాని అనుకోకుండా అది జరిగింది. పదకొండు గంటల తరువాత కొండమీదకొచ్చాడు. స్నానం చేసుకుని గుడివైపు వెళ్లాడు. ఎవరో నడవలేని పెద్దాయనను ఎత్తుకుని, దేవుడి దర్శనం చేయించాడు. అప్పుడు దేవుడిని దగ్గరగా కొంతసేపు చూశాడు. ఆ దేవుడు వాడిని చూసి చిరునవ్వు నవ్వాడట!"

"ఎంత అదృష్టవంతుడు"

"బయటకొచ్చిన తరువాత ఆ పెద్దాయన నూరు రూపాయలు కోటిగాడి కివ్వబోయాడు. కాని వాడు తీసుకోలేదు. లెంపలేసుకుని, ఆ క్షణం నుంచి తప్పు పనులు చేయనని అనుకున్నాడట. మల్లమ్మ పూలదండలమ్ముతుంటే ఈ మాటే అన్నాడట. దానితో ఆ అమ్మాయి నవ్వుతూ, 'నువ్వంత మంచివాడివైతే నీ చేత తాళి కట్టించుకోనా!' అందట. 'ఇప్పటికైనా మించిపోలేదు. వెళ్లి దేవుడిని చూసిరా! రాగానే దండలు మార్చుకుని పెళ్లి చేసుకుందా'మన్నాడట. ఆ సంగతే నాతో చెప్పి మల్లమ్మ వస్తే మా ఇంట ఉంచమన్నాడు"

"ఆమె వచ్చిందా?"

"ఆమె కోసమే చూస్తున్నాను"

"మరి కోటిగాడెలా పడిపోయాడు?"

"వాడు నా దగ్గర నుంచి వెళ్లి కొత్త బట్టలు తొడుక్కున్నాడు. రెండు పూలదండలు కొనుక్కొచ్చాడు. సత్రం పక్కన నేలంతా బురదగా ఉంది. ఏదో పాట పాడుకుంటూ ఆ దారిన వస్తూ జారి పడిపోయాడు. తలకు బాగా దెబ్బ తగిలింది"

"మీరెవరూ లేరా? వైద్యులు లేరా?"

"ఇవాళ వైకుంఠఏకాదదశి. ఎవరికీ తీరుబడి లేదు"

"మీరైనా?"

"నేను పనిమీద వెళ్లి వచ్చేసరికి రాత్రి పదయింది. లబోదిబో మంటూ పరుగెత్తాను. అప్పటికే వాడు దేవుడిలో కలిసిపోయాడు. పోలీసులు, డాక్టర్లూ వచ్చేవరకూ వాడిని ముట్టుకోవద్దని అందరూ చెప్పారు"

"మల్లమ్మకీ సంగతి తెలియచెప్పలేదా?"

"ఏ క్షణమైనా ఆ అమ్మాయి వస్తుంది"

ఇంతలో మా అల్లుడు వచ్చాడు. నేను సత్రానికి వెళ్తూ కోటిగాడి పక్కనుంచే నడిచాను. ఆ శరీరానికి చలి లేదు. బాధ లేదు! దేవుడిని చూసిన సంతోషమే మిగిలింది!

మరునాడు తొమ్మిది గంటలకు మాకు చాలా మంచి కాటేజీ దొరికింది. సత్రవు విడిచి సామాను పట్టుకుని కోటిగాడి శవం పక్కనుంచే నడుస్తున్నారు ప్రజలు. పోలీసులకు, డాక్టర్లకు తీరుబాటు అవలేదు.

నా మనసు మనసులో లేదు.

కాటేజీలో సావకాశంగా స్నానాలు చేసి, టిఫిన్లు తిని తయారయ్యాం. అప్పుడు నాకో సంగతి జ్ఞాపకం వచ్చింది. మునిస్వామికి ఒక నూరు రూపాయలే ఇచ్చాను. చిల్లర లేక మరో యాభైరూపాయలు బాకీ పెట్టాను. ఆ డబ్బు ఇవ్వడానికి మునిస్వామి ఇంటికి వెళ్లాను.

ఎండ బాగా వచ్చింది. మునిస్వామి ఇంట్లోనే ఉన్నాడు. డబ్బు ఇచ్చివేసి, నిలబడే ప్రశ్న వేశాను "కోటిగాడిని ఇప్పటికైనా..."

"పదిగంటలకు, వాడికెవరూ లేరని, ప్రమాదం వల్ల చచ్చిపోయాడని పంచాయితీ జరిపి తీసుకుపోయారు"


"మల్లమ్మ లేదా?"

అతను వీథి వైపు చూస్తూ ఊరుకున్నాడు.

ఒకమ్మాయి ఆ ఇంటివైపే వస్తోంది. ఆమె జుట్టు బాగా రేగిపోయింది. నిద్రలేక కళ్లు ఎర్రబారి లోతులకు పోయాయి. తొందరగా ఆమె లోపలకు వచ్చింది.

"మునిస్వామి మామా! కోటిగాడేడి?"

అతను గడ్డం సవరించుకుని అటూ ఇటూ చూశాడు.



"మల్లమ్మా! రా, కూర్చో! ముందు నీ సంగతి చెప్పు! నిన్న మధ్యాహ్నం దేవుడిని చూసి వస్తానన్న దానివి ఇప్పుడా వస్తున్నావు?"

నీరసంగా మల్లమ్మ అక్కడున్న బెంచీ మీద కూలబడింది. పిల్లలు కాఫీ ఇస్తే తాగింది.

"ఇక చెప్పు. ఇంతాలస్యం దేనికైంది?"

"ఏం చెప్పను? కోటిగాడు ఓ మాటన్నాడు. అందరూ పోయే వరుసలో ఉండి దేవుడిని చూడమన్నాడు. నేనా సంగతే మరచిపోయి సగం దూరం పైగా పోయాను. మళ్లీ వెనక్కి వచ్చి రెండగంటల వేళ, అడుగునున్న మధ్య హాలులో దూరాను. అందరూ మనవాళ్లే! ఇదేం పని అని కేకలేశారు. కోటిగాడు మారిపోయాడు తప్పుచేయ్యొద్దన్నాడు అన్నాను నేను. నీ కర్మమన్నారు. అక్కడే కూర్చున్నాను. చీకటి పడింది. అక్కడున్న బోర్డు మీద రాత్రి పదకొండు గంటలకి దర్శనం అని ఉంది."

"అప్పుడైనా వచ్చేయలేకపోయావా?"

"ఎలా రాను. మామా? కోటిగాడు దేవుడిని చూసి రమ్మన్నాడు, ఎవరినీ దాటి ముందుకు పోవద్దన్నాడు. ఆలస్యమైనా పరవాలేదన్నాడు!"

"అయితే, ఇంత ఆలస్యమా?"

"ఏం చేయడం? నా ఒక్కతెకే ఆలస్యమా? వేలకొద్దీ ప్రజలు అలా కూర్చున్నారు. వాళ్లందరికన్నా నేనేం ఎక్కువ? ఆ హాలులో బెంచీలు లేవు. ఏమయ్యాయో తెలియదు. రాతి పలకల నేల మంచులా ఉంది. ఎదుటి నుంచి చలిగాలి జోరుగా వీస్తున్నది. కొందరు కప్పుకున్నారు. కొత్త పెళ్లయినవాళ్లు ఒకరినొకరు తగులుతూ కూర్చున్నారు. మేమిద్దరం అలా కూర్చోమా అనుకున్నాను!"

"అవునవును"

"నేనూ కింద మెట్లమీద ఒక కుటుంబం దగ్గర కూర్చున్నాను. ఇంతలో పులిహోర పొట్లాలు వచ్చాయి. దేవుడిని చూడకుండా ఏమీ తినకూడదనుకున్నాను. పక్కన కూర్చున్న వాళ్లు బలవంతంగా నాచేత పాలు తాగించారు. రాత్రి పదయింది. మరొక్క గంట! ఆ గంట కూడా గడిచిపోయింది"

"మిమ్మల్ని విడువలేదూ?"

"కొన్ని వేలమంది టిక్కెట్లు కొనుకున్న వాళ్లకు దర్శనాలవుతున్నాయి. వాళ్ల తర్వాత మాకు అన్నారు. ఆ ఆశా సడలిపోయింది. రాత్రి ఒంటిగంట అయింది. ఒక ముసలాయన సరిగా నడవలేడు. నేలను కూర్చోలేడు. అతనితో అతని భార్య కూడా బాధపడుతోంది. వాళ్ల బాధ చూడలేక నేను వాళ్లకి తొందరగా దర్శనం చేయిస్తానన్నాను. కాని ఆ ముసలాయన ఒప్పుకోలేదు. అందరితోపాటు వెళ్తానన్నాడు"

"లోకంలో కొంతమంది పిచ్చివాళ్లుంటారు. భగవంతుడే ఒప్పుకుంటే వాళ్లకేం?"

"ఆ ముసలాయన న్యాయం తప్పనన్నాడు. తన వాళ్లతో వెళ్లడమే ఆనందమన్నాడు"

"తరువాత ఏమైంది?"

"నిర్దాక్షిణ్యంగా వీచే చలిగాలికి గడ్డకట్టుపోయాం. రాత్రల్లా కళ్లల్లో వత్తులు వేసుకుని కూర్చున్నాం. చివరకు ఉదయం ఆరుగంటలకు హాలు నుంచి బయటకు వచ్చాం. రాత్రల్లా నిద్రలేదు. దేవుడిని ఎప్పుడూ స్నానం చేసి, తిలకం దిద్దుకుని చూసేదాన్ని. కాని ఈ రోజు ఏం చెప్పను...?"

"చెప్పు, చెప్పు"

"పాచి ముఖం... కనీసం తోవలో కుళాయి దగ్గర ముఖమైనా కడుక్కుందామనుకున్నాను. అది కూడా వీలు పడలేదు."

"ఒక్కొక్కప్పుడు అలాగే అవుతుంది"

"మామా! నా జన్మలో ఇలా అవలేదు"

"బయట శరీరాన్ని వదిలిపెట్టు. నీ మనసు నిర్మలంగా లేదా?"

"ఏం నిర్మలం? పెద్ద అపచారం చేశాను. దేవుడిని చూడాలంటే నా కళ్లనిండా నీరు. ఎవరూ కనిపించలేదు. వలంటీర్లు బలంగా నన్ను తోసేశారు. జనం నెట్టారు. నీ దేవుడు..."

మల్లమ్మ ఏడుస్తోంది.

"పిచ్చిపిల్లా! వెళ్లు! కోటిగాడు నిన్ను మంచి దారిలోకి నడిపించాడు. నువ్వెంతమందిని ముందుకు నడిపించాలో, పోయి స్నానం చేసిరా! అన్ని సంగతులూ మాట్లాడుకుందాం!"

మల్లమ్మ వెళ్లిపోయింది.

కోటిగాడి గురించి అతనెందుకు చెప్పలేదు?

మునిస్వామి చాలా గొప్ప మనిషి!

అంతకన్నా గొప్పవాడు కోటిగాడు. వాడు వెళ్లిపోతూ కింద తిరుపతిలో నాతో అన్న మాటలు నేనెప్పుడూ మరచిపోలేను.

"అయ్యగారూ! ఇవాళ చాలా గొప్ప రోజు! దేశంలోని అన్ని చోట్ల నుండి, పై దేశాల నుండి స్వామివారి దర్శనానికి ఎందరో వస్తారు. ప్రతి మనిషిలోను మంచి ఉంటుంది. చెడ్డ ఉంటుంది. స్వామి దర్శనానికి వచ్చిన వాళ్లందరూ చెడ్డను పక్కన పెట్టి మంచిగానే ప్రవర్తిస్తారు. మంచిమనిషిని మనం దేవుడంటాం! అటువంటి దేవతామూర్తులు కొండనిండా ఉంటే అది వైకుంఠం కాక మరేమవుతుంది! వారి మధ్యన మనం ఉండటం కన్నా వేరే ఆనందముందా?"

కోటిగాడి మాటలు తలుచుకుంటూ అశ్రువొకటి తర్పణంగా విడిచాను. ■

